సైన్యానికి సంఘీభావం

స్టాలిన్ నేతృత్వంలో భారీ ర్యాలీ

కామరాజర్‌సాలైలో త్రివర్ణ పతాకాల రెపరెపలు





ర్యాలీ ప్రారంభోత్సవంలో సీఎం స్టాలిన్, ఇతర నేతలు

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను తీవ్రంగా ఖండిస్తూ, పాకిస్థాన్‌పై పోరుసాగిస్తున్న భారత సైన్యానికి మద్దతు ప్రకటిస్తూ శనివారం సాయంత్రం ముఖ్యమంత్రి స్టాలిన్ నాయకత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశ సమైక్యతను చాటేలా డీఎంకే నేతలు, మంత్రులు, ఆ పార్టీ మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలు సహా లక్షమందికి పైగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు. గంటసేపు సాగిన ఈ ర్యాలీకి అపూర్వ స్పందన లభించింది. కామరాజర్‌సాలైకి ఇరువైపులా నగరవాసులు నిలిచి ర్యాలీలో పాల్గొన్నవారివైపు త్రివర్ణ పతాకాలతో స్వాగతం పలికారు. ఈ ర్యాలీ మెరీనాబీచ్‌లోని డీజీపీ కార్యాలయం నుండి ప్రారంభమైంది. సాయంత్రం ఐదు గంటలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ డీజీపీ కార్యాలయానికి విచ్చేశారు. అప్పటికే ఆ ప్రాంతం వద్ద డీఎంకే, దాని మిత్రపక్షాల నాయకులు, కార్యకర్తలకు, ముస్లిం మతపెద్దలు, క్రైస్తవ మతపెద్దలు జాతీయ జెండాలు పట్టుకుని ర్యాలీకి సిద్ధం కాగా, స్టాలిన్ అందరితోపాటు తాను కూడా త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని ర్యాలీని ప్రారంభించారు. ఆయనతో పాటు డీజీపీ శంకర్ జివాల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.మురుగానందం, వారి వెనుకే డీఎంకే మిత్రపక్షాల నాయకులు నడిచారు. మాజీ సైనికులు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు పీకే శేఖర్‌బాబు, కేఎన్ నెహ్రూ, ఎంపీలు దయానిధి మారన్, కనిమొళి, ఎండీఎంకే నేత వైగో, సీపీఐ రాష్ట్ర కమిటీ కార్యదర్శి ముత్తరసన్, సీపీఎం రాష్ట్ర కమిటీ కార్యదర్శి షణ్ముగం, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసు కానిస్టేబుళ్లు, సాయుదదళం కానిస్టేబుళ్లు కూడా జాతీయ పతాకాలు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఉగ్రవాదం నశించాలి అనే నినాదాలతో ముద్రించిన ప్లకార్డులు చేతపట్టుకుని విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీ సందర్భంగా మెరీనాబీచ్ కామరాజర్ సాలై పూర్తిగా త్రివర్ణ పతక మయమైంది. ఐలాండ్ గ్రౌండ్స్ సమీపంలోని యుద్ధవీరుల స్మారక స్థూపం వద్ద పహల్గామ్ వద్ద ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన 26 మంది చిత్రపటాల వద్ద స్టాలిన్ సహా నాయకులు పుష్పాంజలి ఘటించడంతో ఈ ర్యాలీ ముగిసింది. ఆ తర్వాత యుద్ధవీరుల స్మారక స్థూపం వద్ద స్టాలిన్, మంత్రులు, డీఎంకే మిత్రపక్షాల నాయకులు అంజలి ఘటించారు.

స్టాలిన్‌కు గవర్నర్ శుభాకాంక్షలు

భారత సైన్యానికి మద్దతుగా బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలోని ఎనిమిది కోట్ల మంది తమిళులంతా భారత సైన్యానికి సంఘీభావం ప్రకటించేలా ముఖ్యమంత్రి స్వీయ నాయకత్వంలో ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.

మెరీనాలో సాగుతున్న ర్యాలీ



ఉగ్ర దాడిలో అశువులు బాసిన వారికి నివాళులర్పిస్తున్న స్టాలిన్ తదితరులు

ర్యాలీలో భారీ ఏర్పాట్లు...

స్టాలిన్ పిలుపు మేరకు శనివారం సాయంత్రం భారతసైన్యానికి గట్టి మద్దతు పలుకుతూ నిర్వహించిన ర్యాలీలో డీజీపీ కార్యాలయం నుండి ఐలాండ్ గ్రౌండ్స్ దాకా 10 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, 200చోట్ల గుడారాలు, 30 చోట్ల తాగునీరు, 50 చోట్ల మరుగుదొడ్లు, 15 అంబులెన్స్‌లు కూడా ఏర్పాటు చేశారు.



చిన్నారులతో నిర్వాహకులు

బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- జెట్-చెన్నై అధ్యక్షులు రవీంద్రకుమార్ రెడ్డి
- వేసవి శిబిరం విజయవంతం

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్-చెన్నై (జెట్) అధ్యక్షులు రవీంద్రకుమార్‌రెడ్డి అన్నారు. త్రిదండి చినజీయర్ స్వామి మంగళాశాసనాలతో జెట్ ఆధ్వర్యంలో కృతజ్ఞత పేరిట ప్రజ్ఞా సమ్మర్ క్యాంప్-2025 ఈ నెల 5 నుంచి శనివారం వరకు 6 రోజులపాటు నిర్వహించారు. ఐదేళ్ళ నుండి 13ఏళ్ళ వయసు గల చిన్నారులకు యోగా, కథలు, శ్లోకాలు, ఆధ్యాత్మిక ఆటలు, మేధస్సుకు పదునుపెట్టే వివిధ అంశాలు నేర్పించారు. సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమం మైలాపూర్‌లోని ఆంధ్ర మహిళా సభ మహిళా విద్యాలయంలో శనివారం నిర్వహించి, చిన్నారులకు ధృవీకరణపత్రాలు, బహుమతులు ప్రదానం చేశారు. సభాధ్యక్షుడు రవీంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ, సర్వప్రాణి సేవే... మాధవ సేవ... అనే చిన్నజీయర్ స్వామి ఆదేశాల మేరకు గత రెండు దశాబ్దాలుగా జెట్ చెన్నై తరుపున చిన్నారుల్లో నైతిక విలువలు, సత్ప్రవర్తన, క్రమశిక్షణ, దైవ, దేశభక్తి పెంచేలా సమ్మర్ క్యాంపులు విజయవంతంగా నిర్వహిస్తూవస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీసిటీ అధినేత రవీంద్ర సన్నారెడ్డి ప్రతి ఏడాది సమ్మర్ క్యాంపు కోసం రూ.లక్ష విరాళం ప్రకటించారు. అలాగే ఆంధ్ర మహిళా సభ, మహిళా విద్యాలయాలకి రూ. లక్ష విరాళం ప్రకటించారు. చిన్నారులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత సైన్యానికి మద్దతుగా చిన్నారులు శ్లోకాలను వినిపించారు.

రాష్ట్రంలో వీక్లీ మోడల్
వైద్యశిబిరం

- ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం



మోడల్ వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతివారం వీక్లీ మోడల్ వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రకటించారు. సైదాపేట నియోజకవర్గంలో శనివారం రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మోడల్ వైద్య శిబిరాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఈ శిబిరంలో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాల గురించి మీడియాకు వివరించారు. రాష్ట్ర అసెంబ్లీలో ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన బిల్లులో 1,256 ఉన్నతస్థాయి వైద్య శిబిరాలు నిర్వహించేందుకు రూ.9.42 కోట్లు ప్రకటించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు ఈ నెల నుంచి 2026 జనవరి చివరి వారం వరకు 1,256 ప్రత్యేక వైద్యశిబిరాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేలా ఆరోగ్యశాఖ ప్రణాళిక రూపొందించిందని, ఈ పథకానికి ముఖ్యమంత్రి స్టాలిన్ త్వరలోనే శ్రీకారం చుడతారని తెలిపారు. ఒక్కొక్క జిల్లాలో వారంలో ఒక రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరాలు పనిచేస్తాయని, వీటిలో ఈసీజీ, కార్డియాలజీ, ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్‌స్కాన్, టీబీ, కుష్ఠు తదితర రోగాలను గుర్తించే పరీక్షలు, క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే కనుగొనే పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలతో పాటు బాధితులు చికిత్స కూడా పొందవచ్చని మంత్రి సుబ్రమణ్యం తెలిపారు.

కరూర్‌లో రూ.3 కోట్ల మోసం


- నగల దుకాణ యజమాని అరెస్టు



శబరి శంకర్

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ, ఆకర్షణీయమైన పథకాల పేరుతో డిపాజిట్లు సేకరించి తిరిగి చెల్లించని కేసులో సేలం నగల దుకాణం యజమానిని కరూర్ పోలీసులు అరెస్టు చేశారు. శనివారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే... సేలం జిల్లా వలసైయూర్ మేట్టు వీధికి చెందిన శబరిశంకర్ (36) అనే వ్యక్తి సేలం కేంద్రంగా ఎస్‌వీఎస్ పేరుతో నగల దుకాణం నడుతున్నారు. ఈ దుకాణం బ్రాంచ్ కరూర్ పాత బస్టాండు సమీపంలో ఉంది. అయితే, ఈ నగల దుకాణంలో డిపాజిట్లు చేసే వారికి భారీ మొత్తంలో వడ్డీతో పాటు ఇతర ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని విస్తృతంగా ప్రచారం చేశారు. దానిని నమ్మిన కరూర్ జిల్లాకు చెందిన వెల్లియానై ప్రాంతానికి చెందిన రామలింగం (44) అనే వ్యక్తి రూ.17 లక్షల మేర డిపాజిట్ చేశారు. ఆ తర్వాత ఈ మొత్తానికి నెలవారీ వడ్డీతో పాటు ఇతర రాయితీలను చెల్లించలేదు. పలు మార్లు వడ్డీ చెల్లించాలని కోరినప్పటికీ శబరి శంకర్ నుంచి స్పందన లేదు. దీంతో బాధితుడు కరూర్ జిల్లా నేర విభాగం పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో శబరి శంకర్ మోసం చేసినట్టు తేలడంతో పోలీసులు అతడిని అరెస్టు చేసి జైలుకు తరలించారు.

విరిసిన రోజాలు
మురిసిన సందర్శకులు





నీలగిరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన ఊటీలో 20వ వార్షిక గులాబీ పూల ప్రదర్శన శనివారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమైంది. ఊటీకి ప్రతియేటా వేసవిలో దేశవిదేశాల నుండి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివస్తుంటారు. పర్యాటకుల కోసం జిల్లా యంత్రాంగం, ఉద్యానవనాల శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సమ్మర్ ఫెస్టివల్ ఈ నెల 3న కొత్తగిరి నెహ్రూ గార్డెన్‌లో కాయగూరల ప్రదర్శనతో ప్రారంభమైంది. ఆ తర్వాత శుక్రవారం గూడలూరులో సుగంధ ద్రవ్యాల ప్రదర్శన నిర్వహించారు. ఇక శనివారం ఉదయం ఊటీ మధ్యలోని రోస్‌గార్డెన్‌లో 20వ వార్షిక గులాబీ పూల ప్రదర్శనను సమాచార శాఖ మంత్రి ఎంపి.సామినాధన్ ప్రారంభించారు. డీఎంకే ఎంపీ ఎ. రాజా, ప్రభుత్వ విప్ రామచంద్రన్, నీలగిరి జిల్లా కలెక్టర్ లక్ష్మీభవ్యా తదితర అధికారులు పాల్గొన్నారు. ప్రదర్శన సందర్భంగా గార్డెన్ అంతా వివిధ రకాల పూలతో అలంకరించారు. అందమైన పూలతో స్వాగత తోరణాలు కూడా నిర్మించారు. పర్యాటకులకు కనువిందు చేసేలా ముదురు ఎరుపు రంగు గులాబీలు, లేత ఎరుపు రంగు గులాబీలతో పలు ఆకృతులను రూపొందించారు. సుమారు 20వేల గులాబీలతో డాల్ఫిన్ ఆకారాని తయారు చేశారు. రోస్ గార్డెన్‌లో 40 రకాల గులాబీల దగ్గర పర్యాటకులు సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. . తొలిరోజే ఈ ప్రదర్శనను తిలకించేందుకు వేల సంఖ్యలో పర్యాటకులు తరలిరావటంతో రోజ్ గార్డెన్ సందడిగా మారింది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి



ఊటీలో అట్టహాసంగా గులాబీల ప్రదర్శన ప్రారంభం





ప్రదర్శన ప్రారంభిస్తున్న మంత్రి సామినాధన్

సమాచార దృష్టి

నేడు తిరువణ్ణామలైకు ప్రత్యేక రైలు

వాషర్‌మెన్‌పేట, మే 10 (ఆంధ్రజ్యోతి): చిత్రా పౌర్ణమి సందర్భంగా తిరువణ్ణామలై వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06137 తాంబరం-తిరువణ్ణామలై ప్రత్యేక అన్‌రిజర్వ్‌డ్ మెము రైలు తాంబరం నుంచి ఆదివారం ఉదయం 11.30 గంటలకు బయల్దేరి మధ్యాహ్నం 3.30 గంటలకు తిరువణ్ణామలై చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06138 తిరువణ్ణామలై-తాంబరం ప్రత్యేక అన్‌రిజర్వ్‌డ్ మెము రైలు తిరువణ్ణామలై నుంచి సోమవారం సాయంత్రం 5 గంటలకు బయల్దేరి రాత్రి 8.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్లు చెంగల్పట్టు, మేల్‌మరువత్తూర్, దిండివనం, విల్లుపురం, తిరుకోవిలూరు స్టేషన్‌లలో ఆగునున్నాయి.

రెండో ఏసీ రైలు పనుల ప్రారంభం

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఏసీ సబర్బన్ రైలు సేవలు ఇటీవల ప్రారంభించగా, దీనికి ప్రయాణికుల నుంచి మంచి స్పందన వచ్చింది. దీంతో మరో ఏసీ సబర్బన్ రైలు తయారీ పనులు పెరంబూరులోని ఐసీఎఫ్‌లో తాజాగా ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు ప్రాంతాల మధ్య గత నెల 19 నుంచి ప్రారంభమైన ఈ రైలుకు డిమాండ్ పెరగడంతో ఏసీ బోగీల సంఖ్య 10కు పెంచారు. ఈ నేపథ్యంలో రెండో ఏసీ సబర్బన్ రైలు తయారీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

నేటినుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలను నేటి నుంచి ఈ నెల 25వ తేదీ వరకు మొత్తం 15 రోజుల పాటు వేసవి సెలవులు ప్రకటించారు. అయితే, ఈ సెలవు రోజుల్లో కూడా చిన్నారులకు పౌష్టికాహారాన్ని యథావిధిగానే పంపిణీ చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి జయశ్రీ మురళీధరన్ ఓ ప్రకటనలో ఆదేశించారు.

నేడు, రేపు డ్రైవర్లు, కండక్టర్లకు సెలవు రద్దు : ఎంటీసీ

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎంటీసీ) బస్సు డ్రైవర్లు, కండక్టర్లు ఆది, సోమవారాల్లో సెలవు తీసుకోరాదని ఎంటీసీ యాజమాన్యం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో, పౌర్ణమి, ముహూర్తం రోజులైన ఆదిసోమవారాల్లో ఎంటీసీ బస్సు డ్రైవర్లు, కండక్టర్లు తప్పనిసరిగా డ్యూటీకి రావాలని, విధులు హాజరుకాని వారి వివరాలను సంబంధిత ఎంటీసీ డిపో మేనేజర్లు అందించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ప్రజల సంక్షేమార్థం ఇప్పటికే సెలవుల్లోవున్న ఉద్యోగులు ఈ నెల 11,12 తేదీల్లో డ్యూటీకి హాజరై సహకరించాల్సిందిగా ఎంటీసీ బోర్డు కోరింది.

ఏర్వాడి దర్గాలో చందనోత్సవం ప్రారంభం

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా ఏర్వాడిలో ఉన్న ప్రసిద్ధ దర్గాలో చందనోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర మంత్రి రాజకన్నప్పన్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. ఏర్వాడిలో మహాన్ కుత్బుసుల్తాన్ సయ్యద్ ఇబ్రహీం హషీద్ బాదుషా నాయగం దర్గా ఉంది. ఇక్కడ ప్రతియేటా మే నెలలో చందనోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ వేడుకలు శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో జెండావిష్కరణతో ప్రారంభించారు. మతసామరస్య ఊరేగింపుతో పాటు చందనోత్సవం ఈ నెల 21వ తేదీన సాయంత్రం ప్రారంభమై 28వ తేదీ సాయంత్రం ముగుస్తాయి.

విల్లివాక్కంలో కర్రసాము శిక్షణ

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక విల్లివాక్కంలో కర్రసాముపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమైన ఈ శిక్షణ ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగనుంది. కొడైక్కెనాల్ కర్రసాము శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ప్రారంభించారు. విల్లివాక్కంలోని తిరు నగర్‌లో ప్రారంభంకాగా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి 7.30 గటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు కొనసాగుతుంది. ఉద్యోగం చేస్తున్న మహిళలు కూడా ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. ఇలాంటి వారికి శని, ఆదివారాల్లో సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు కొనసాగుతుంది.

కపాలీశ్వర కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూరులోని కపాలీశ్వర కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి పీకే శేఖర్‌బాబు శుక్రవారం అడ్మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ కాలేజీ నెలకొల్పి ఐదేళ్లు అయిందన్నారు. కొత్త విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్లు ప్రారంభించామన్నారు. ప్రస్తుతం 743 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 347 మందికి ఉపాధి అవకాశాలు కూడా లభించాయన్నారు. పూంపుహార్ నగర్‌లో రూ.25 కోట్లతో ఈ కాలేజీ కోసం కొత్త భవనాలను నిర్మిస్తున్నామని, ఇవి వచ్చే యేడాదికి అందుబాటులో వస్తాయన్నారు. అలాగే, కాంచీపురం ఏకాంబరనాథ స్వామి ఆలయం ఆధ్వర్యంలో కీల్పాక్కం, సమయపురం ప్రాంతాల్లో నర్సింగ్ కళాశాలలను ప్రారంభించనున్నట్టు మంత్రి శేఖర్‌బాబు తెలిపారు. దేవాదాయ శాఖ అడిషనల్ కమిషనర్ పళని తదితరులు పాల్గొన్నారు.

సామిచేనుమిట్ట చెక్‌పోస్టులో సీసీ కెమెరాలు



బంగారుపాళ్యం, మే 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-తమిళనాడు రాష్ట్ర సరిహద్దు సమీపంలోని సామిచేనుమిట్ట చెక్‌పోస్టులో ఎస్పీ మణికంఠ ఆదేశాలతో సీసీ కెమెరాలను శనివారం ఏర్పాటు చేసినట్లు సీఐ కత్తి శ్రీనివాసులు తెలిపారు. ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేయడానికి వీటిని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే బారికేడ్లను పెట్టామన్నారు. ఆయనవెంట ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

జూన్ మొదటివారంలోనే పాఠ్యపుస్తకాల పంపిణీ



పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న విద్యాశాఖాధికారులు

టి.నగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఒకటో తరగతి నుండి ప్లస్-2 వరకు వచ్చే విద్యాసంవత్సరానికిగాను (2025-2026) 64 లక్షల మంది విద్యార్థులకు 4.19 కోట్ల పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం పాఠ్యపుస్తకాలను జిల్లాకేంద్రాల్లోని గోదాములకు సరఫరా చేస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన వెంటనే జూన్ మొదటి వారంలోగా పుస్తకాలను పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వ సిలబస్ పాటించే పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బూట్లు, సాక్స్‌లు, క్రేయాన్లు, సైకిళ్లు, జామెట్రీబాక్స్‌లు తదితర విద్యా ఉపకరణాలు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చెన్నై జిల్లాలో పంపిణీ కోసం చింతాద్రిపేట కల్యాణమండపంలో భద్రపరచిన పుస్తకాలను పాఠశాలల విద్యాశాఖ సంచాలకులు ఎస్. కన్నన్, జిల్లా విద్యాశాఖాధికారి పుగళేంది తదితరులు పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు, విద్యా ఉపకరణాలను పార్శిల్ చేసి నగరంలోని అన్ని పాఠశాలలకు పంపించాలని సిబ్బందికి ఆదేశించారు.

తిరుచెందూరు హుండీ ఆదాయం రూ.3.22 కోట్లు



వసంతమండపంలో హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

టి.నగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి వారి హుండీ ఆదాయం రూ.3.22 కోట్ల మేర లభించినట్లు ఆలయ నిర్వాహకులు ప్రకటించారు. గత ఏప్రిల్‌లో ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ఆలయ వసంతమండపంలో శుక్రవారం జరిగింది. లెక్కింపు పూర్తయిన తర్వాత రూ.3,22,12,735 నగదు, 1.37 కేజీల బంగారం, 51.100 కేజీల వెండి వస్తువులు కానుకల రూపంలో లభించినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన



తిరుత్తణి, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణిలో విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న ట్రైనీ ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో తిరుత్తణి రిటైర్డ్ డీఈ లోకమణి, డివిజన్ విద్యుత్‌శాఖ ఇంజనీర్ భాస్కరన్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది విద్యుత్‌శాఖ ఉద్యోగులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

యోగా మాస్టర్ల సేవలు అభినందనీయం



శ్రీదేవి, కుమార్‌లకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యూనివర్సిటీ నిర్వాహకులు

తిరుత్తణి, మే 10 (ఆంధ్రజ్యోతి): పిరమిడ్ ధ్యాన మందిర్ యోగా శిక్షకులు శ్రీదేవి, కుమార్ దంపతుల సేవలు ప్రశంసనీయమని పలువురు వక్తలు కొనియాడారు. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు పరిధిలోని సామంతవాడలో బాలయోగేశ్వర పిరమిడ్ ధ్యాన మందిర్ వ్యవస్థాపకులు మాస్టర్ శ్రీదేవి, కుమార్ దంపతులు చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను గుర్తించిన భారత్ విర్చువల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ (బీవీయూపీఈ) నిర్వాహకులు వారికి శుక్రవారం డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు ఆరోగ్యంగా జీవించాలంటే ప్రతిరోజు యోగా జీవన విధానంలో భాగమవ్వాలని సూచించారు. అదేవిధంగా తమ దంపతులకు డాక్టరేట్‌ను అందించిన బీవీయూపీఈ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు.

తిరుత్తణిలో ప్రారంభమైన పుష్కరిణి పునరుద్ధరణ పనులు



తిరుత్తణి, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయ కోనేరు పునరుద్ధరణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఆలయంలో చిత్తిరై ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకున్న భక్తులు, స్వామివారి పుష్కరిణిలో స్నానాలు చేస్తుంటారు.. దీనిని దృష్టిలో ఉంచుకుని రూ.22.50లక్షలతో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం కోనేరు శుద్ధీకరణ పనులు పూర్తిచేశారు. అదేవిధంగా కోనేరు చుట్టు ప్రాకారాల నిర్మాణ పనులు కూడా మరో 20 రోజుల్లో పూర్తిచేయించనున్నట్లు జాయింట్ కమిషనర్ రమణి, ఆలయ నిర్వాహకులు తెలిపారు.

భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలంటూ 12న ధర్నా

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 12వ తేదీ సోమవారం ధర్నా చేపట్టనున్నట్లు తమిళనాడు ఇంజనీర్ల సంఘం ప్రకటించింది. ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.జగదీశన్ శనివారం మీడియాతో మాట్లాడుతూ నిర్మాణ పనులకు ఉపయోగించే వస్తువుల ధరలు రెండింతలు పెంచారని, వాటిని అదుపు చేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని కోరుతూ, తమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాలో బిల్డర్స్ అసోసియేషన్, భవన నిర్మాణ కార్మికుల సమాఖ్య, ఇసుక లారీ యజమానుల సంఘం, ల్యాండ్ బ్రోకర్ల సంఘం, రహదారుల కాంట్రాక్టర్ల సంఘం, ప్రజా పనుల కాంట్రాక్టర్ల సంఘం, ఇటుక బట్టీల తయారీదారుల సంఘాలు సంయుక్తంగా అన్ని జిల్లాకేంద్రాల్లో ధర్నాల్లో పాల్గొంటాయని ఆయన తెలిపారు.

మీ రాకకోసం ఎదురు చూస్తున్నా!

● యవజన మహానాడుకు అన్బుమణి పిలుపు



పార్టీ శ్రేణులను ఆహ్వానిస్తూ పీఎంకే విడుదల చేసిన అన్బుమణి ఫొటో

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): చిత్రాపౌర్ణమి సందర్భంగా మహాబలిపురం సమీపం తిరువిడందైలో ఆదివారం రాత్రి నిర్వహించనున్న పీఎంకే యువజన మహానాడుకు తరలిరావాలంటూ ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులను నమస్కరించి ఆహ్వానించేలా అన్బుమణి ఫొటో తో కరపత్రాలు, పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన వీడియోలోనూ అనుబ్మణి మీ రాకకోసం ఎదురుచూస్తున్నాను. ప్రశాంతంగా యవజన మహానాడుకు విచ్చేయండి, ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా పాల్గొని మహానాడును విజయవంతం చేయాలని అన్బుమణి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తన ఎక్స్‌పేజీలోనూ ఆయన ఓ సందేశాన్ని పొందుపరిచారు.

సీపీఐ నేత నల్లకన్నుకు గాయం

● జీహెచ్‌లో చికిత్స



నల్లకన్ను

టి.నగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు ఇరా. నల్లకన్ను (100) ఇంటిలో జారిపడటంతో గాయమై రాజీవ్‌గాంధీ స్మారక సర్వజనీన ప్రభుత్వ ఆసుపత్రి (జీహెచ్)లో చికిత్స కోసం చేరారు. ఆయన చెవి దగ్గర గాయం ఏర్పడటంతో వైద్యులు కుట్లువేసి చికిత్స చేశారు. స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఐ సీనియర్ నాయకుడు నల్లకన్ను వృద్ధాప్య సమస్యల కారణంగా నందనంలోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువారం రాత్రి టాయ్‌లెట్‌కు వెళ్లేందుకు లేచినప్పుడు మంచం మీది నుంచి కింద పడ్డారు. ఆ సమయంలో మంచానికున్న రేకు తగలటంతో ఆయన చెవికి గాయం ఏర్పడింది. వెంటనే కుటుంబీకులు ఆయనను చికిత్స కోసం జీహెచ్‌కు తరలించారు. ఆ ఆసుపత్రి డీన్ డాక్టర్ శాంతారామన్ నాయకత్వంలో వైద్యులు ఆయనకు అన్ని పరీక్షలు చేసి చెవి తెగిన చోట కుట్లు వేశారు. శుక్రవారం మధ్యాహ్నం వైద్యులు ఆయనను డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం నల్లకన్ను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని, పార్టీ శ్రేణులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని కుటుంబీకులు తెలిపారు.

సైన్యం కోసం ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో పాల్గొన్న అన్నాడీఎంకే నేతలతో ఎమ్మెల్యే దళవాయి సుందరం

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కన్నియాకుమారిలో అన్నాడీఎంకే ఆధ్వర్యంలో శనివారం 1,808 పొంగళ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వళ్లియామఠంలోని ఇసైక్కియమ్మ ఆలయ ప్రాంగణంలో కౌన్సిలర్ అక్షయ కన్నన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కన్నియాకుమారి అన్నాడీఎంకే ఎమ్మెల్యే, మాజీమంత్రి దళవాయి సుందరం ముఖ్యఅతిథిగా హాజరై ఈ పూజల్లో పాల్గొన్న మహిళలకు వెండి పాత్రలు, బంగారు నాణేలను బహుమతిగా అందజేశారు.

జూన్ 15నుంచి కొత్త బస్సులు

● రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా జూన్ 15 నుండి కొత్త మినీ బస్సు సేవల పథకం ప్రారంభకానుంది. ప్రస్తుతం రవాణా సదుపాయం లేని ప్రాంతాల ప్రజల విజ్ఞప్తిని పరిశీలించిన ప్రభుత్వం ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 2,950 మినీ బస్సులు నడుపుతున్న నేపథ్యంలో, ఈ సేవలను విస్తరించేందుకు కొత్త మినీ బస్సుల పథకాన్ని పరిచయం చేయనున్నట్లు రాష్ట్రప్రభుత్వం అసెంబ్లీలో ప్రకటించింది. ఈ పథకానికి సంబంధించి రూపొందించిన ప్రణాళికను గత ఏడాది జూన్‌లో ప్రభుత్వం విడుదల చేసింది. దీనికి సంబంధించిన జీవో కూడా కూడా విడుదలైంది. మరోవైపు బస్సు సదుపాయం లేని ప్రాంతాల్లో 17 కిలోమీటర్ల దూరం, రవాణా వసతులున్న ప్రాంతాల్లో 4 కిలోమీటర్ల వరకు మినీ బస్సు నడుపేందుకు ప్రైవేటు ట్రాన్స్‌పోర్టర్లకు ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుతం రాజధాని చెన్నైలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తిరువొత్తియూర్, మనలి, మాధవరం, అంబత్తూరు, ఆలందూర్, పెరుంగుడి, షోలింగనల్లూరు ప్రాంతాల్లో మినీ బస్సులు ప్రారంభించడంపై రవాణాశాఖ పరిశీలిస్తోంది. ఈ పథకానికి మినీ బస్సుల యజమానుల సమాఖ్య మద్దతు ప్రకటించిన నేపథ్యంలో, సీఐటీయూ, ఏఐటీయూసీ, తదితర కార్మిక సంఘాలు అభ్యంతరం తెలిపాయి. దీంతో ఈ వ్యవహారానికి సంబంధించిన అభిప్రాయ సేకరణ సమావేశం సచివాలయంలో గత ఏడాది జూలై 8న జరిగింది. ఈ సమావేశంలో 23 అభిప్రాయాలకు ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ప్రభుత్వ రవాణా సంస్థల ఆధ్వర్యంలో రవాణా వసతులు లేని ప్రాంతాల్లో కూడా మినీ బస్సు సేవలను ప్రారంభించాలని నిర్ణయించారు. రవాణా సేవలు అందుబాటులో లేని ప్రాంతాల్లో 8.70 కిలోమీటర్ల వరకు అదనంగా బస్సులు నడుపవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కొత్త పథకం వచ్చే జూన్ 15నుంచి అమల్లోకి వస్తుందని సచివాలయం శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

23 నుంచి ఇసుక క్వారీ యజమానుల సమ్మె

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23వ తేదీ నుంచి ఇసుక క్వారీ యజమానుల సమాఖ్య రాష్ట్రవ్యాప్త సమ్మెకు సిద్ధమైంది. ఆ రోజు నుంచి ఇసుక లారీలను నడుపబోమని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు యువరాజ్ శనివారం ఉదయం ప్రకటించారు. రాష్ట్రప్రభుత్వం విధించిన కఠిన నిబంధనల వల్ల 18 నెలలుగా ఇసుక క్వారీలు పనిచేయలేక, ప్రత్యామ్నాయంగా ఎంశాండ్ వినియోగిస్తున్నారు. ఎంశాండ్ ధర యూనిట్‌కు రూ.వెయ్యి చొప్పున రెండుసార్లు క్వారీ యజమానులు పెంచారు. మరోవైపు భవన నిర్మాణ సామగ్రి కూడా రెండింతలు పెంచడంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిర్మాణాలకు అంతరాయం ఏర్పడింది. భవన నిర్మాణ పనులపై ఆధారపడిన లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోవడంతో స్పందించిన ప్రభుత్వం ఎంశాండ్ ధర యూనిట్‌కు రూ.వెయ్యి చొప్పున తగ్గిస్తామని ఇచ్చిన హామీ కూడా నెరవేరలేదు. రాళ్లక్వారీలకు కేరళ ప్రభుత్వం స్టే విధించినందువల్ల రాష్ట్రం నుండి కేరళకు చట్టవిరుద్ధంగా లారీలద్వారా రాళ్ల తరలింపు కొనసాగుతోంది. ఇందువల్ల ప్రభుత్వ ఆదాయానికి ఏడాదికి రూ.25కోట్లు నష్టం ఏర్పడిందని అందువల్ల క్వారీలను ప్రభుత్వమే నిర్వహించాలనే డిమాండ్ తలెత్తింది.ఈసమస్యల కారణంగా జీవనాధారం కోల్పోయిన ఇసుక క్వారీ యజమానుల సమాఖ్య తమను ఆదుకోవాలంటూ ప్రభుత్వాన్ని పలుమార్లు విన్నవించుకున్నా.. ఫలితం లేదని తెలిసింది. ఇసుక క్వారీలను ప్రారంభించేందుకు అనుమతించాలని ఈనెల23వతేదీనుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెచేపట్టనున్నట్లు యువరాజ్‌తెలిపారు.

జలంధర్ నుంచి తిరిగొచ్చిన విద్యార్థులు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్ - పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో పంజాబ్‌లో చిక్కుకున్న రాష్ట్రానికి చెందిన ఐదుగురు విద్యార్థులు సురక్షితంగా నగరానికి చేరుకున్నారు. వీరికి ప్రభుత్వం అన్ని విధాలుగా సాయం చేయడంతో వారు వచ్చారు. పంజాబ్ రాష్ట్రం జలంధర్ జిల్లాలోని ఒక ప్రైవేటు యూనివర్శిటీలో వారు చదువుతున్నారు. భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధవాతావరణం కారణంగా పంజాబ్‌తో పాటు పలు సరిహద్దు రాష్ట్రాల్లోని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో ఈ విద్యార్థులు రాష్ట్రానికి వచ్చేందుకు విమాన సర్వీసులు కూడా లేకపోవడంతో ప్రభుత్వ సాయం కోరారు. ఈ నేపథ్యంలో జలంధర్ నుంచి ప్రత్యేక వాహనంలో ఢిల్లీకి వచ్చిన ఈ విద్యార్థులు.. ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో చెన్నై చేరుకున్నారు. తామంతా తీవ్రమైన మానసిక ఒత్తిడిలో ఉన్న సమయంలో ప్రభుత్వం తమను ఆదుకుని రాష్ట్రానికి తీసుకొచ్చిందని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రానికి వచ్చిన విద్యార్థుల్లో నామక్కల్, కోయంబత్తూరు, కళ్ళకుర్చి జిల్లాలకు చెందిన వారున్నారు. వీరిని విమానాశ్రయంలో రాష్ట్ర మంత్రి నాజర్ స్వాగతం పలికి, అక్కడ నుంచి బస్సుల్లో వారివారి సొంతూర్లకు వెళ్ళేలా ఏర్పాటు చేశారు.

గంజాయి విక్రయించిన నలుగురి అరెస్టు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరువాన్మియూరు బస్టాండు సమీపంలో గంజాయి విక్రయిస్తున్న కేసులో ఇద్దరు మహిళల సహా నలుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... తిరువాన్మియూరు బస్టాండు సమీపంలో ఓ వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నట్లు అడయారు ఎక్సైజ్ విభాగం పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు మఫ్టీలో వెళ్ళి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతడి లగేజీని తనిఖీ చేయగా, 25 కేజీల గంజాయి సహా మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఆ వ్యక్తిని హరీష్ (23)గా గుర్తించారు. అతడిచ్చిన సమాచారంతో హైదరాబాద్‌కు చెందిన మురుగేశన్, పీటర్, పూజఅనే వారిని అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బాలికను నిర్బంధించి అత్యాచారం

● ఐదుగురు మైనర్ల సహా ఆరుగురి అరెస్టు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా సెంజి సమీపంలో 14 యేళ్ళ బాలికను ఇంట్లో నిర్బంధించి అత్యాచారం చేసిన కేసులో ఐదుగురు మైనర్ల సహా ఆరుగురును పోలీసులు అరెస్టు చేశారు. సెంజి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 14 యేళ్ళ బాలిక గత నెల 26వ తేదీ తన తాతతో కలిసి వెళ్తుండగా, కనిపించకుండా పోయారు. దీనిపై బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విచారణలో అనంతపురంలోని ఒక యువకుడు ఇంటిలో ఆ బాలిక ఉన్నట్టు గుర్తించి, రక్షించారు. ఈ కేసులో ఐదుగురు మైనర్లు, మరో యువకుడిని అరెస్టు చేశారు.

ఒకే రాత్రి 23 మంది రౌడీల అరెస్టు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): సెంబియం పోలీస్ స్టేషన్ పరిధిలో సురేష్ అనే వ్యక్తిపై దాడి చేసి దోపిడీ చేసుకున్న కేసులో పెరంబూరు నీలం గార్డెన్‌కు చెందిన శరవణన్, వేలాయుధం అనే ఇద్దరిని అరెస్టు చేశారు. వీరి వద్ద జరిపిన విచారణలో ఈ దాడి, దోపిడీ కేసులో ఒట్టేరి ప్రాంతానికి చెందిన వినోద్ కుమార్ , రాజేష్, రాసయ్య, అబ్దుల్, గోపినాథ్, పట్టాలం ప్రాంతానికి చెందిన ఫెరోజ్ ఖాన్ , స్టీఫన్, సెల్వం, గణేశన్ అనే వారిని అరెస్టు చేశారు. వీరిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మామిడిపండు కోసం చెట్టెక్కి విద్యార్థి మృతి



అభిషేక్ (ఫైల్‌ఫొటో)

టినగర్, మే 10 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి నూసైపురంలో స్నేహితులతో ఆడుతూ ఓ విద్యార్థి మామిడి పండు కోయడానికి అక్కడే ఉన్న చెట్టెక్కి, కిందపడి ప్రాణాలు కోల్పోయాడు. ముళంగుళివారవిళై ప్రాంతానికి చెందిన అభిషేక్ (16) శుక్రవారం మధ్యాహ్నం నూసైపురం వద్ద స్నేహితులతో ఆడుకుంటూ అక్కడే ఉన్న మామిడి చెట్టులో ఉన్న పండ్లను కోయడానికి చెట్టెక్కి ప్రయత్నిస్తుండగా కొమ్మవిరిగింది. ఆ కొమ్మతోపాటు కిందపడిన అభిషేక్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కుళిత్తురై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మార్గమధ్యంలోనే మరణించినట్లు ప్రకటించారు. మార్తాండం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

రౌడీషీటర్ నుంచి గంజాయి స్వాధీనం

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): పలు నేరాలకు పాల్పడి అజ్ఞాతంలోకి జారుకున్న రౌడీషీటర్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతడి నుండి 7.5 కిలోల గంజాయి, మోటరు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఆవడి పోలీసులు తెలిపారు. ఐసీఎఫ్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన చెంగా (38)అనే రౌడీషీటర్‌పై హత్య, దోపిడీ, దొంగతనాలు తదితర 80కి పైగా కేసులు పెండింగులో ఉన్నట్లు సమాచారం. ఓ కేసులో బెయిల్‌పై విడుదలైన చెంగా బెయిలు ముగిసినా కోర్టులో హాజరుకావకపోవడంతో అతడికి న్యాయస్థానం అరెస్టు వారెంటు జారీచేసింది. దీంతో ఆవడి పోలీసులు అతడి కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ముత్తా పుదుపేట సమీపంలోని అగరం కందిగై ప్రాంతంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న చెంగాను శుక్రవారం సాయంత్రం గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అతని బైక్‌ను, బ్యాగులో ఉంచిన 7.5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచిన అనంతరం పుళల్ జైలుకు తరలించారు.

అత్యాచారం కేసులో కార్మికుడికి జీవిత ఖైదు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లాలో ఏడేళ్ళ చిన్నారిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ప్రభు అనే కార్మికుడుకి కడలూరు జిల్లా పోక్సో కోర్టు జీవిత కారాగారశిక్షను విధించింది. బాలికను ప్రభు అనే కామాంధుడు మాయమాటలు చెప్పి ఇంటికి తీసుకెళ్ళి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపె బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు విచారణ పోక్సో కోర్టులో సాగగా సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి లక్ష్మి రమేష్ నిందితుడు ప్రభుకు యావజ్జీవ కారాగారశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు.

గిరిప్రదక్షిణకు అనువైన సమయం ఇదే...

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): తిరువణ్ణామలైలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అరుణాచలేశ్వరాలయంలో చిత్తిరై పౌర్ణమి వేడుకలు ఆదివారం జరుగనున్నాయి. దీన్ని పురస్కరించుకుని అనేక మంది భక్తులు గిరిప్రదక్షిణ చేసేందుకు తిరువణ్ణామలై రానున్నారు. ఈ గిరిప్రదక్షిణకు శుభ ఘడియలు ఆదివారం రాత్రి 8.53 గంటల నుంచి సోమవారం రాత్రి 10.48 గంటల వరకు ఉన్నాయని వేదపండితులు వెల్లడించారు. కాగా, ఈ యేడాది చిత్తిరై పౌర్ణమికి సుమారుగా 8 నుంచి 10 లక్షల మంది భక్తులు గిరిప్రదక్షిణకు వస్తారని జిల్లా యంత్రాంగం అంచనా వేసింది. అందుకు తగినవిధంగా ఆలయంతో పాటు గిరిప్రదక్షిణ మార్గంలో అన్ని ఏర్పాట్లుచేశారు.

ఇంజనీరింగ్ కోర్సులపై పెరిగిన ఆసక్తి

● 75 వేల మంది దరఖాస్తు

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ యేడాది ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తికనబరుస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో వివిధ కోర్సులలో అడ్మిషన్లు పొందటానికి ఈ నెల 7న ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. మరుసటి రోజూ రాష్ట్రమంతటా ప్లస్-2 ఫలితాలు వెల్లడయ్యాయి. ఆ రోజు నుంచి ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. ఈ నెల 7న 14,462 మంది, ప్లస్-2 ఫలితాలు వెలువడిన రోజు 29,186 మంది, శుక్రవారం 23,341 మంది మొత్తం 66,989 మంది దరఖాస్తు చేసుకున్నారు. గత యేడాది కంటే ఈ యేడాది ఇంజనీరింగ్ కోర్సులలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తికనబరుస్తున్నారని అడ్మిషన్ల విభాగం కార్యదర్శి పురుషోత్తమన్ తెలిపారు. సీబీఎస్ఈ ఫలితాలు వెలువడిన తర్వాత ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తు చేసేవారి సంఖ్య మరింత పెరుగుతుందన్నారు. జూన్ 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని చెప్పారు.

విద్యుత్ కోతలపై ప్రజల నిరసన



ఆందోళన చేస్తున్న ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

తిరుత్తణి, మే 10 (ఆంధ్రజ్యోతి): గత మూడురోజులుగా పళ్లిపట్టు పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు చెట్లు విరిగి రోడ్లపై పడ్డాయి. దీంతో గురువారం సాయంత్రం 4 గంటల నుండి విద్యుత్‌శాఖ అధికారులు పళ్లిపట్టు సమీపంలోని పుదుపేట, కుమారరాజుపేట, ఇచ్చాంబడి, వెంకటరాజుకుప్పం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రాత్రి 9 గంటలైనా కరెంటు రాకపోవడంతో పళ్లిపట్టులోని ఆంజనేయనగర్ ప్రాంతానికి చెందిన ప్రజలు రాత్రి 10.30 గంటల సమయంలో సబ్ స్టేషన్ ముందు ఆందోళనకు దిగారు. సమాచారం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని ఈదురుగాలుల కారణంగా చెట్లు కూలి, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురైయ్యాయని, విద్యుత్‌శాఖ అధికారులతో మాట్లాడి, వాటి మరమ్మతు పనులు పూర్తవ్వగానే విద్యుత్ సరఫరా జరిగేలా చర్యలు చేపడతామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



వరలక్ష్మి ప్రధానపాత్రలో

'ది వెర్డిక్ట్'

నటి వరలక్ష్మి ప్రధాన పాత్రలో కొత్త దర్శకుడు కృష్ణ శంకర్ డైరెక్ట్ వహించిన చిత్రం 'ది వెర్డిక్ట్'. అగ్ని ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై మోహన్‌దాస్ నిర్మించారు. వరలక్ష్మి, శృతి హరిహరన్, సుహాసిని, విద్యుల్లేఖ, ప్రకాష్ మోహన్‌దాస్ తదితరులు నటించగా ఈ నెల 30వ తేదీ విడుదలకానుంది. టీజర్‌ను ప్రముఖ సినీ నటి ఖుష్బూ ఇప్పటికే రిలీజ్ చేయగా, ప్రముఖ గేయరచయిత మదన్ కార్కీ తొలి సింగిల్ రిలీజ్ చేశారు. అయితే, రెండో సింగిల్‌ను శుక్రవారం విడుదల చేయాల్సి ఉండగా, భారత్ - పాకిస్థాన్ మధ్య యుద్ధం జరుగుతుండటంతో వాయిదా వేశారు. ఈ పాటను ఆదివారం విడుదల చేయనున్నట్టు మేకర్స్ వెల్లడించారు.

ప్రేమ - వైఫల్యాన్ని వివరించే 'ఎన్ కాదలే'

సాధారణంగా సినిమాల్లో యువకుల ప్రేమ వైఫల్యం గురించి మాత్రమే చూపిస్తుంటారు. కానీ, తమిళ సినిమాలో తొలిసారి ఒక యువతి ప్రేమ వైఫల్యాన్ని, తద్వారా ఆమె అనుభవించే బాధను వివరిస్తూ రూపొందించిన చిత్రం 'ఎన్ కాదలే'. స్కై వాండర్స్ పతాకంపై నిర్మించి జయలక్ష్మి దర్శకత్వం వహించారు. తాజాగా విడుదలైన ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి ముఖ్యంగా టీనేజ్ యువత నుంచి మంచి స్పందన వస్తుంది. లింగేష్, లైలా, దివ్య హీరోహీరోయిన్లుగా నటించగా, కాట్రాడి రాజన్, మారన్, గంజా కరుప్పు, మధుసూదన్ రావు, దర్శన్ ఇతర పాత్రలు పోషించారు. ఈ చిత్ర కథను ఆమె వివరిస్తూ, 'చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయిన హీరో... మేనమామ వద్ద పెరుగుతాడు. అతని కుమార్తె దివ్య హీరో లింగేష్‌ను పెళ్ళి చేసుకోవాలని భావిస్తుంది. ఇంతలో తమిళ సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకునేందుకు ఓ విదేశీ యువతి నగరానికి రాగా, ఆమెను హీరో ప్రేమిస్తాడు. హీరోకు, హీరోయిన్‌కు, విదేశీ యువతికి మధ్య ఏం జరిగిందన్నదే ఈ చిత్ర కథ. గంజా కరుప్పు బృందం హాస్యపు సన్నివేశాలు పండించారు. ముక్కోణపు ప్రేమస్టోరీని ప్రేక్షకులకు బోర్ కొట్టకుండా, పాత చిత్రాల తరహాలో కాకుండా కొత్తదనంతో చెప్పేందుకు ప్రయత్నించాం అని పేర్కొన్నారు.

'ఎన్ కాదలే'లో ఓ దృశ్యం



'రెట్రో' హీరోకు డైమండ్ గిఫ్ట్



శక్తివేలన్‌కే ఉంగరాన్ని తిరిగి బహుకరించిన సూర్య

సూర్య - పూజా హెగ్డే జంటగా కార్తీక్ సుబ్బురాజ్ దర్శకత్వంలో 2డీ ఎంటర్‌టైన్మెంట్స్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ నిర్మించిన 'రెట్రో' మూవీ ఈ నెల ఒకటో తేదీన విడుదలై ఘన విజయం సాధించింది. ఈ సినిమాను శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీపై నిర్మాత శక్తివేలన్ పంపిణీ చేశారు. తొలివారంలోనే ప్రపంచ వ్యాప్తంగా రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. దీంతో నిర్మాత శక్తివేలన్ చిత్ర హీరో, సాంకేతిక నిపుణులకు గోల్డ్, డైమండ్ రింగ్‌లను బహూకరించారు. నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో నిర్మాత శక్తివేలన్ మాట్లాడుతూ, 'రాష్ట్రంలో 'రెట్రో' మూవీ విడుదల చేసేందుకు అవకాశం కల్పించిన చిత్ర నిర్మాతలు సూర్య, జ్యోతిక, 2డీ కంపెనీ సహ నిర్మాత రాజశేఖర్ పాండియన్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ యేడాది విడుదలైన చిత్రాల్లో అత్యధిక కలెక్షన్లు రాబట్టిన చిత్రంగా 'రెట్రో' నిలిచింది. దీంతో చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బురాజ్, సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్, సినిమాటోగ్రాఫర్ శ్రేయాస్ కృష్ణకు బంగారు ఉంగరాలు, హీరో సూర్యకు డైమండ్ ఉంగరాన్ని నిర్మాత శక్తివేలన్ బహూకరించారు. అయితే, హీరో సూర్య తిరిగి ఆ బహుమతిని శక్తివేలన్‌కే తిరిగిచ్చారు.

గత జన్మ నేపథ్యంలో

'జన్మనచ్చత్తిరం'



'జన్మనచ్చత్తిరం'లో ఓ దృశ్యం

గత జన్మ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'జన్మనచ్చత్తిరం'. అమోహం స్టూడియోస్, వైట్ లాంప్ పిక్చర్స్ పతాకంపై కె.సుభాషిణి నిర్మించారు. థమన్ అక్షన్, మాల్వి మల్హోత్రా జంటగా నటించిన ఈ మూవీ ఫస్ట్‌లుక్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఈ సినిమా గురించి దర్శకుడు బి.మణివర్మన్ మాట్లాడుతూ, 'గత జన్మల నేపథ్యంలో తీసిన ఈ సినిమా కథ చాలా భిన్నంగా, స్క్రీన్ ప్లే ప్రత్యేకంగా ఉంటుంది. ఇందులో 666 అనే సంఖ్యపై సస్పెన్స్ అదేంటనేది వెండితెరపై తెలుసుకోవాల్సిందే. షూటింగ్ పూర్తి చేసి, తుదిదశ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా రోమియో పిక్చర్స్ పతాకంపై నిర్మాత రాహుల్ విడుదల చేయనున్నారు. ఇతర పాత్రల్లో మైత్రేయ, రక్షా సెరిన్, శివం, అరుణ్ కార్తీ, కాళీ వెంకట్, మునీష్ కాంత్, వేలా రామ్మూర్తి, తలైవాసల్ విజయ్, సంతాన భారతి, బాయ్స్ రాజన్, నక్సలైట్ నివేదిత తదితరులు నటించారు.



కూరగాయలు, పండ్ల వ్యర్థాల సేకరణ

రాజధాని మహానగరంలోని 15 జోన్ల పరిధిలో సేకరించే వ్యర్థాల నుంచి మిథేన్ గ్యాస్, సేంద్రియ ఎరువులను తయారు చేయడంలో జీసీసీ విజయం సాధించింది. ఆహారం, కూరగాయల వ్యర్థాలు, జంతువుల పేడను ఉపయోగించి శాస్త్రీయ పద్ధతిలో సహజవాయువు తయారు చేస్తున్నారు. ఇటీవలే సీఎం స్టాలిన్ ప్రారంభించిన ఈ విజయవంతమైన ప్రాజెక్టుపై ఈ వారం ప్రత్యేక కథనం.

- అడయార్, ఆంధ్రజ్యోతి

వ్యర్థాల నుంచి వాయువు



సిలిండర్లలోకి గ్యాస్ నింపుతున్న దృశ్యం



వ్యాన్ ద్వారా గ్యాస్ తరలింపు

- బయోడిగ్రేడబుల్ వ్యర్థాల నుంచి నేచురల్ గ్యాస్
- 95 శాతం మిథేన్ ఉత్పత్తి
- జీసీసీ ఆధ్వర్యంలో రూ.25 కోట్లతో ప్లాంట్

SUNDAY SPECIAL

చెన్నై మహానగరంలో వస్తున్న బయో వ్యర్థాలు (బయోడిగ్రేడబుల్ వ్యర్థాలు) ఇపుడు సహజవాయువుగా, సేంద్రియ ఎరువులుగా మారిపోతున్నాయి. ఇందుకోసం నగర శివారు ప్రాంతమైన కొడుంగయూరులో రూ.25 కోట్లతో బయోడిగ్రేడబుల్ ప్లాంట్‌ను నిర్మించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగిన ఈ ప్లాంట్‌లో వ్యర్థాలను గ్యాస్ రూపంలోకి మారుస్తున్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలో వచ్చే 50.20లక్షల కేజీల ఘన వ్యర్థాలను, సేకరించి, కొడుంగయూరులో 270 ఎకరాలు, పెరుంగుడిలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న డంపింగ్ యార్డులకు తరలిస్తోంది. ఈ వ్యర్థాలను వేరు చేసేందుకు వీలుగా వివిధ రకాలైన ప్రాజెక్టులను అమలు చేస్తోంది. ఇలాంటివాటిలో బయోడిగ్రేడబుల్ ప్రాజెక్టు ఒకటి. బయో డిగ్రేడబుల్ వ్యర్థాల నుంచి సహజవాయువుతో పాటు ఎరువులను కూడా తయారు చేస్తున్నారు. దీనికి నగరవాసుల నుంచి కూడా మంచి స్పందన వచ్చింది. ఈ ప్లాంట్‌లో 1.10లక్షల కేజీల వ్యర్థాలను జెయింట్ రియాక్టర్ యంత్రాల ద్వారా వివిధ ప్రక్రియల్లో ప్రాసెస్ చేస్తారు. తద్వారా రోజుకు 3,500 కిలోల సహజ వాయువు, 15వేల కేజీల సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. చెన్నై కార్పొరేషన్‌లోని మొత్తం 15 జోన్ల నుంచి సేకరించే ఆహారం, కూరగాయల వ్యర్థాలు, జంతువుల పేడను సహజవాయువు తయారీ కోసం వినియోగిస్తున్నారు. ముందుగా కూరగాయల వ్యర్థాలను ఒక యంత్రంలో వేసి వాటిని చిన్నచిన్న ముక్కలుగా కోసి గుజ్జుగా చేస్తారు. ఈ గుజ్జుతో పాటు పేడను నీటిలో కలిపి ద్రవరూపంలోకి మారుస్తారు. దీన్ని జెయింట్ ఎలక్ట్రిక్ మోటారు సాయంతో మరో ట్యాంకులోకి రవాణా చేస్తారు. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని పైపు ద్వారా గ్యాస్ ఉత్పత్తి చేసే రియాక్టర్లలోకి పంపుతారు. మొత్తం 5 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంగల వాయురహిత డిజాస్టర్లలో ఈ మిశ్రమాన్ని సమారుగా 45 రోజుల పాటు నిల్వ ఉంచడం వల్ల సహజవాయువు ఉత్పత్తి అవుతుంది. బయోడిగ్రేడబుల్ వ్యర్థాల నుంచి ఉత్పత్తయ్యే సహజ వాయువులో దాదాపు 95 శాతం మీథేన్ కాగా, దీనిని శుద్ధి చేసి హోటల్స్, పెట్రోల్ బంకులకు సిలిండర్లలో సరఫరా చేస్తున్నారు. మిగిలిన వ్యర్థాలను సేంద్రియ ఎరువులుగా మార్చి రైతులకు సరఫరా చేస్తున్నారు. ఈ మొత్తం ప్లాంట్ నిర్వహణ, పర్యవేక్షణ కోసం ఒక పర్యవేక్షణ వ్యవస్థను కూడా ఏర్పాటు చేయడం విశేషం.



గ్యాస్ ఉత్పత్తిని పరిశీలిస్తున్న సిబ్బంది



వ్యర్థాల గుజ్జును ద్రవరూపంలోకి మారుస్తున్న దృశ్యం





ప్లాంట్ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది





ప్లాంట్ ప్రాంగణంలో పచ్చదనం

విద్యార్థులకు బహుముఖ పరిజ్ఞానం అవసరం

- ఏఐసీటీఈ చైర్మన్ సీతారామన్
- ఘనంగా సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ స్నాతకోత్సవం

ప్యారీస్, మే 10 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, విద్యార్థులకు బహుముఖ పరిజ్ఞానం అవసరమని ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చైర్మెన్ డాక్టర్ టీజీ సీతారామన్ పేర్కొన్నారు. షోలింగనల్లూరు ఓఎంఆర్ రోడ్డులోని సెయింట్ జోసెఫ్ ఇంజనీరింగ్ కళాశాల 26,27వ స్నాతకోత్సవం శనివారం కళాశాల చైర్మెన్ డాక్టర్ బాబు మనోహరన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ సీతారామన్ 26,27 బ్యాచ్‌లకు చెందిన 2,374 మంది పట్టభద్రులకు పట్టాలను అందజేశారు. అలాగే ర్యాంకులు సాధించిన 117 మంది విద్యార్థులకు డాక్టర్ బాబు మనోహరన్‌తో కలిసి క్యాష్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీతారామన్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ, సవాళ్లను ఎదుర్కొనే నైపుణ్యత ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ శశిశేఖర్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ వడ్డి శేషగిరిరావు, డాక్టర్ అరివలగన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ర్యాంక్ హోల్డర్లతో డాక్టర్ బాబు మనోహరన్, డాక్టర్ సీతారామన్ తదితరులు



ముఖ్యమంత్రిగా ఐదో ఏడాదిలోకి ప్రవేశించిన డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌ను శనివారం ఆయన నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు చెబుతున్న ప్రముఖ తమిళ సినీ గేయ రచయిత వైరముత్తు

తొలిసారి హజ్‌యాత్రకు వెళ్లే మహిళకు సబ్సిడీ నగదు అందిస్తున్న ముఖ్యమంత్రి



తొలిసారి హజ్‌యాత్రకు వెళ్లేవారికి రూ.25వేల సబ్సిడీ

- అందజేసిన సీఎం స్టాలిన్

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటి సారి హజ్‌యాత్రకు వెళ్లే 5650 మంది ముస్లింలకు తలా రూ.25వేలు సబ్సిడీ పథకం శనివారం నుంచి అమలులోకి వచ్చింది. ఆ మేరకు సచివాలయంలో శనివారం ఉదయం రాష్ట్ర బీసీ, ఎంబీసీలు, మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో 10 మంది లబ్ధిదారులకు తలా రూ.25 వేల చొప్పున సబ్సిడీ నగదును సీఎం అందజేశారు. ఇటీవల ముగిసిన శాసనసభ సమావేశాల్లో తొలిసారిగా హజ్‌యాత్రకు వెళ్లేవారికి ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ నగదును రూ.25వేలకు పెంచనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఆ మేరకు ఈ సబ్సిడీ నగదును పొందటానికి 5650 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరిలో పది మందికి సబ్సిడీ నగదును ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రి ఎస్‌ఎం.నాజర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, రాష్ట్ర హజ్‌కమిటీ అధ్యక్షుడు, శాసనసభ్యుడు అబ్దుల్ సమద్, బీసీ, ఎంబీసీలు, మైనారిటీల సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. విజయరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైన్యం తలచుకుంటే ప్రపంచ చిత్రపటం నుండి పాక్ మాయం

- బీజేపీ నేత అన్నామలై



ప్రైవేట్ కళాశాల స్నాతకోత్సవంలో ఓ విద్యార్థికి పట్టా ప్రదానం చేస్తున్న బీజేపీ నాయకుడు అన్నామలై

చెన్నై, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత దేశానికి ఉన్న సైనిక సంపత్తిని ఉపయోగించి పది రోజుల్లో పాకిస్థాన్‌ను ప్రపంచ చిత్రపటం నుంచి మాయమయ్యేలా చేయగలమని బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై పేర్కొన్నారు. భారతసైన్యానికి సంఘీభావం తెలుపుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ భారీ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమన్నారు. కన్నియాకుమారి జిల్లా అంజు గ్రామం సమీపంలోని ఓ ప్రైవేటు కళాశాలలో శనివారం జరిగిన స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన అన్నామలై విద్యార్థులకు సర్టిఫికెట్లు, పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ భారత, పాక్‌ల మధ్య శత్రుత్వం ఈనాటిది కాదని, ఉగ్రవాదులను పెంచిపోషిస్తున్న ఆ దేశానికి గుణపాఠం చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని, ఆ దిశగానే భారత సైన్యం ఉగ్రవాదుల స్థావరాలపైనే దాడులు జరిపిందన్నారు.



సదస్సులో ఆర్‌ఎస్ మునిరత్నం తదితరులు

ఆర్‌ఎంకే కాలేజీలో ఐఎస్‌టీఈ ప్రొఫెసర్ల సదస్సు

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన కవరైపేటలో ఉన్న ఆర్‌ఎంకే ఇంజనీరింగ్ కాలేజీలో ఐఎస్‌టీఈ ప్రొఫెసర్ల 27వ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆర్‌ఎంకే ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ ఆర్‌ఎస్ మునిరత్నం అధ్యక్షత వహించారు. కాలేజీ డైరెక్టర్ ఆర్.జ్యోతి నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌ఎం కిషోర్, కార్యదర్శి యలమంచి ప్రదీప్, అడ్వైజర్లు డాక్టర్ ఎంఎస్ పళనిస్వామి, డి.పిచ్చాండి, వి.మనోహర్, డీన్‌లు ఎల్విన్ చంద్రమౌళి, కేకే శివజ్ఞానప్రభు, కే. మణివణ్ణన్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఐఎస్‌టీఈలో దేశ వ్యాప్తంగా 1.50 లక్షల మంది ప్రొఫెసర్లు, 4 లక్షల మంది విద్యార్థులు సభ్యులుగా ఉన్నారు. ఈ సందర్భంగా మునిరత్నం మాట్లాడుతూ, గత యేడాది ఐఎస్‌టీఈ ఆధ్వర్యంలో 150కుపైగా కార్యక్రమాలను నిర్వహించినట్టు తెలిపారు.

నటుడు 'సూపర్‌గుడ్' సుబ్రమణి మృతి



'సూపర్‌గుడ్' సుబ్రమణి (ఫైల్‌ఫొటో)

అడయార్, మే 10 (ఆంధ్రజ్యోతి): నటుడు 'సూపర్‌గుడ్' సుబ్రమణి (58) శనివారం కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపతున్న ఆయన జీహెచ్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. ఆయన వైద్య ఖర్చుల కోసం పలువురు సినీ నటీనటులు సాయం కూడా చేశారు. ఇటీవల ఆయన ఆరోగ్యం కొంతమేరకు కుదుటపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. అయితే, మళ్ళీ తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ఆస్పత్రికి తరలించారు. ఐసీయూలో చికిత్స పొందుతుండగా శనివారం మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. కాగా, గత 30 యేళ్ళుగా చిత్ర పరిశ్రమలో కొనసాగుతున్న ఆయన ఇటీవల విడుదలైన 'కమాండోవిన్ లవ్ స్టోరీ' అనే చిత్రంలో చివరిసారి కనిపించారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని వెస్ట్ మాంబళంలోని ఇంటికి తరలించి సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు. సుబ్రమణి మృతి పట్ల పలువురు నటీనటులతో పాటు నడిగర్ సంఘం సభ్యులు తమ ప్రగాఢ సంతాపం, సానుభూతి వ్యక్తం చేశారు. ప్రముఖ నిర్మాత ఆర్‌బీ చౌదరికి చెందిన సూపర్‌గుడ్ ఫిలిమ్స్‌లో పనిచేయడంతో ఆయన పేరు సూపర్‌గుడ్ సుబ్రమణిగా స్థిరపడిపోయింది. ఈయన 'పరియేరుమ్ పెరుమాళ్', 'కాలా', 'పిశాసు', 'రజినీ మురుగన్', 'జైభీమ్' వంటి అనేక చిత్రాల్లో నటించారు.



కోట మండల సరిహద్దులో మత్స్యకారులకు సూచనలిస్తున్న మెరైన్ ఎస్ఐ శివసొమ్య, ఏఎస్ఐ రాధ

సముద్రతీరంలో నిఘా పెంపు

● 18 తీర ప్రాంత గ్రామాల్లో అప్రమత్తం

కోట, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం నేపథ్యంలో సముద్రతీర గ్రామాలు అప్రమత్తమయ్యాయి. మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో నిఘా పెంచారు. కోట, చిల్లకూరు, వాకాడు మండలాల్లోని 18 గ్రామాల్లో కదలికలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు మెరైన్ ఎస్ఐ శివసొమ్య తెలిపారు. బయట వ్యక్తుల సంచారం, సముద్రంలోకి అపరిచిత పడవలు, స్టీమర్ల రాకను గుర్తిస్తే వెంటనే 9392914744 నంబర్‌కు, అదేవిధంగా టోల్‌ఫ్రీ నంబర్ 1093కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

భారత ఆర్మీకి చిన్నారుల ఆర్థికసాయం



తిరుపతి(ఎంఆర్‌పల్లె), మే 10(ఆంధ్రజ్యోతి): భారత ఆర్మీకి చిన్నారులు శనివారం ఆర్థికసాయం చేశారు. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో తమ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించుకోవడం ఇష్టం లేక తిరుపతికి చెందిన అనిరుధ్ శ్రీరామ్, సుచిత్ర శ్రీఅనన్య, ఆశిత్ శ్రీరామ్ అనే ముగ్గురు చిన్నారులు తమ పుట్టిన రోజుకు అయ్యే ఖర్చును భారత ఆర్మీకి ఇవ్వాలని నిర్ణయించారు. ఆ మేరకు తమ తల్లిదండ్రులతో కలిసి శనివారం టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో నగదు అందజేశారు. దానిని భారత ఆర్మీకి పంపేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సర్వదర్శనానికి 11 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.45 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 68,213

తలనీలాలు సమర్పించినవారు: 29,635

అమ్మ దిద్దిన ఐపీఎస్‌లు



అమ్మకి మరోపేరే త్యాగం. ఓర్పు, నేర్పు.. అమ్మదనంతో అలవోకగా అలవడే లక్షణాలు. బిడ్డల కోసం జీవితంతో పోరాడే ధీశాలి. భూదేవితో తప్ప అమ్మను మరిక దేనితోనూ పోల్చలేం. అందుకే.. 'తానుండలేని తావులో తనకు బదులుగా దేవుడు అమ్మని సృష్టించాడు' అని చెబుతారు. కని, పెంచిన కష్టం మాత్రమే కాదు.. బిడ్డల బంగారు భవిష్యత్తుకూ అమ్మ రూపశిల్పి. అమ్మ పట్టుదలకూ, ప్రేమకూ, అమ్మకన్న కలలకూ ప్రతిరూపాలే పిల్లలు. అమ్మ తీర్చిదిద్దిన ఈ బిడ్డలు ఐపీఎస్‌లు అయ్యారు. వెంకటేశ్వర్.. తిరుపతి జిల్లాకు పరిపాలనా సారథ్యం వహిస్తున్నారు. మౌర్య తిరుపతి నగర పాలన బాధ్యతల్లో ఉన్నారు. వీరిద్దరు అమ్మల గురించి ఆంధ్రజ్యోతితో పంచుకున్న సంగతులు.. వారి మాటల్లోనే..

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అమ్మ కల ఇది!



● తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

ఆమె కష్టాలూ, త్యాగాలూ వెలకట్టలేను!

మాది పెద్ద కుటుంబం. ఐదుగురు పిల్లలం. ఒక అన్న, ముగ్గురు అక్కల తర్వాత నేను. అంతమందిని చదివించి పెంచి పెద్ద చేయడం అంటే మాటలు కాదు. అమ్మ ఉద్యోగం వదులుకుని వచ్చేశాక ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డాం. వాటి తీవ్రత, అమ్మ పడిన కష్టాల గురించి అంతకుమించి చెప్పలేను. మా కోసం తను పడిన కష్టాలు, చేసిన త్యాగాలకు వెలకట్టలేను.



మాకోసం కెరీర్‌నే వదులుకున్నారు!

మా కోసం అమ్మ తన ఉద్యోగాన్ని, కెరీర్‌ను పూర్తిగా వదులుకున్నారు. నేను హైస్కూలు చదువు స్థాయికి వచ్చేసరికి ఎదిగే వయసులో పిల్లలతో గడపాలని, మా మంచి చెడ్డలు చూడాలని సౌదీ అరేబియాలో ఉద్యోగం వదిలిపెట్టేసి వచ్చేశారు. నిజానికి సౌదీలో ఇరవై ఏళ్ల అనుభవం ఉన్నందున ఇక్కడికి వచ్చాక సిటీల్లో ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా మంచి ఉద్యోగంలో చేరే అవకాశం ఉండింది. కేవలం మా కోసమే అమ్మ అలాంటి ప్రయత్నం చేయలేదు. మాతోనే ఉండిపోయి తన కెరీర్‌నే పూర్తిగా వదులుకున్నారు.

అమ్మ కల.. నా ఐఏఎస్

నేను చిన్నప్పటి నుంచీ చదువులో చురుకుగా ఉండేవాడిని. అది గమనించిన అమ్మ.. నువ్వు ఐఏఎస్ చేయాలి అనేది. అది చిన్నప్పుడే నాలో నాటుకుంది. అమ్మకి ఆ కోరిక ఎందుకు కలిగిందంటే.. 2001లో మా సొంత మండలం కొమరోలు (ప్రకాశం జిల్లా) జడ్పీటీసీ స్థానం బీసీ మహిళలకు రిజర్వు అయింది. బీసీ జనరల్ అయివుంటే నాన్న వెంకటయ్య పోటీ చేసివుండేవారు. మహిళకు రిజర్వు కావడంతో అమ్మ పోటీ చేసి జడ్పీటీసీగా గెలిచారు. నాన్న కూడా సర్పంచుగా, జడ్పీటీసీగా పనిచేశారు. ప్రజాప్రతినిధులు కావడం వల్ల వారికి కలెక్టర్ వంటి ఐఏఎస్ అధికారులను కలిసే అవకాశం ఉండేది. దాంతో నన్ను ఐఏఎస్ ఆఫీసర్‌గా చూడాలన్న ఆశ, పట్టుదల అమ్మకు ఇంకా ఎక్కువైంది. ప్రతి సందర్భంలోనూ ఆ విషయాన్ని గుర్తు చేస్తూ ఉండేవారు. అందుకే మెడిసిన్ పూర్తి చేసినప్పటికీ డాక్టర్‌గా కొనసాగకుండా కేవలం అమ్మకోసమే సివిల్స్ వైపు దృష్టి మళ్లించా. తొలి రెండు ప్రయత్నాలలో ఆలిండియా సర్వీసెస్‌కు ఎంపికైనా అమ్మ కోసమే పట్టుదలగా ప్రయత్నించి మూడవసారి ఐఏఎస్ సాధించా. ఆ క్షణం అమ్మ పడిన సంబరం, సంతోషం వర్ణించలేను. తనే ఐఏఎస్ సాధించినట్టు ఫీలయ్యారు. ట్రైనీ కలెక్టర్‌గా విధుల్లో చేరిన రోజు నా కుర్చీలో కూర్చోబెట్టినపుడు అమ్మ కళ్లలోని ఆ మెరుపులు చాలు నా జీవితానికి అనిపించింది. అలాగే రిపబ్లిక్ డే ఉత్సవాలలో రాష్ట్రపతి ప్రతినిధిగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం, పోలీసు గౌరవ వందనం స్వీకరించడం వంటి సందర్భాలు ప్రత్యక్షంగా చూసిన అమ్మ గర్వపడిన క్షణాలను ఎప్పటికీ మరచిపోలేను. పిల్లల కోసం ఇన్ని త్యాగాలు చేసిన అమ్మకు సంతోషం కలిగించడం తప్ప ఇంకేం ఇవ్వగలం.. అమ్మ రుణం ఎన్నటికీ తీర్చుకోలేనిది.. ఏ బిడ్డలకైనా!

అమ్మ పట్టుదల

● తిరుపతి నగర కమిషనర్ మౌర్య



నా విజయంలో సగం ఆమెదే

అమ్మ జయశ్రీ పెద్దచదవరి కాదు. మాది కడప జిల్లా ప్రొద్దుటూరు సమీపంలోని నాగులపల్లి. పల్లెలో పుట్టి పెరిగిన అమ్మ.. బిడ్డల కోసం పెద్ద కలలు కనింది. ఆ కలలు నెరవేరడానికి కొండలా నిలబడింది. నా ఐపీఎస్ సాధనయాత్రలో అమ్మ కష్టం.. అమ్మ త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే! నాకు అమ్మంటే ఇష్టం. అమ్మకు చదవంటే ఇష్టం. అమ్మ కళ్లలో మెరుపుకోసం మరింత కష్టపడి చదివేదాన్ని. సివిల్స్ కోసం ఢిల్లీకి వెళితే అమ్మ నాతోపాటు వచ్చేది. ఢిల్లీలో చిన్న అద్దెగదిలో అమ్మా..నేనూ.. ఇద్దరమే ఉండేవాళ్లం. ప్రతి పరీక్షకూ అమ్మ నాతోపాటూ సెంటర్‌కు వచ్చేది. ఇంట్లోనే అన్నం కూరలూ చేసి తెచ్చేది. ఉదయం నుంచి సాయంత్రం దాకా అక్కడే కాసుకుని ఉండేది. సివిల్స్‌కి నాలుగుసార్లు ప్రయత్నించి విఫలమయ్యా. ఇక సాధించగలనా? అన్న అనుమానం కలిగి అసంతృప్తిచెందినప్పుడు.. అమ్మ నాకు బాసటగా నిలచింది. వెన్నుతట్టి ప్రోత్సహించేది. చాలా ధైర్యం చెప్పేది. ఆ తర్వాత హైదరబాద్‌కు వచ్చేశాం. అక్కడ ఒక ఫ్లాట్ తీసుకుని ఐదోసారి సివిల్స్‌కు ప్రయత్నించా. అప్పుడు కూడా అమ్మ ఇల్లొదిలి వచ్చి నాతోపాటు ఉండిపోయింది. ఐదో ప్రయత్నంలో ర్యాంకు సాధించా. నా ఐపీఎస్ ప్రయత్నంలో కష్టం అమ్మదే. ఆ విజయంలో సగం అమ్మకే దక్కుతుంది.

ఇప్పుడూ ఆమే!

ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా అమ్మ నాకు ఆసరాగానే ఉంది. విధి నిర్వహణలో ఎక్కువ సమయం బయట ఉండాల్సి ఉంటుంది. ఇప్పుడు కూడా ఇంట్లో ఎక్కువగా అమ్మ ఉంటుంది. మా బాబును ఆమే చూసుకుంటుంది. నాకు స్వేచ్ఛ ఇచ్చింది. విలువలు నేర్పింది. అమ్మ నా మార్గదర్శి కూడా. 62 ఏళ్ల వయస్సులో ఇప్పుడు కూడా ఆమె సలహాలు బాగా ఇస్తారు. ఏదైనా బాధ, సంతోషం కలిగినప్పుడు పెళ్లికి ముందు అమ్మతోనే షేర్ చేసేకునేదాన్ని. పెద్ద రిలీఫ్ అనిపించేది. ఇప్పుడు భర్తతో పంచుకుంటా.

పెళ్లికాక ముందే పుట్టినింటి భారం

అమ్మ పేరు కాశమ్మ. నర్సింగ్ కోర్సు చేశారు. ఇంటి పరిస్థితి అమ్మని పెళ్లికాక ముందే సౌదీ అరేబియాకు చేర్చింది. అప్పటికి అమ్మ వయసు 19 ఏళ్లట. అక్కడ నర్స్‌గా ఉద్యోగం చేస్తూ అమ్మ నాన్నా అమ్మలకు, తోబుట్టువులకు అండగా నిలిచారు. పెళ్లి తర్వాత కూడా చాలా వరకూ వారి మంచిచెడ్డలు పట్టించుకున్నారు.

చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా!

అమ్మ ఇరవై ఏళ్ల సౌదీ అరేబియాలో ఉద్యోగం చేశారు. పెళ్లయ్యాక, మేము పుట్టాక కూడా అక్కడే కొనసాగారు. ఏడాదికి రెండుసార్లు వచ్చి మమ్మల్ని చూసి వెళ్లేవారు. చిన్నతనంలో అమ్మను బాగా మిస్సయ్యా. నేనే కాదు మా అన్న, అక్కలు అందరికీ ఆ వెలితి ఉండేది. అప్పట్లో అమ్మ మాతో లేకపోవడం వల్ల ఒకటవ తరగతి నుంచే నన్ను హాస్టల్‌లో చేర్చారు. తర్వాత నా చదువంతా అలానే హాస్టల్‌లోనే గడిచింది.

నేటి నుంచి తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), మే 10(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని తమిళనాడులోని తిరువణ్ణామలై గిరిప్రదక్షిణకు తరలి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. సెంట్రల్ బస్టాండులో ఆదివారం ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రతి పది నిమిషాలకూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. అమరావతి, ఇంద్రా ఏసీ, సూపర్‌లగ్జరీ, ఎక్స్‌ప్రెస్, అల్ట్రాడీలెక్స్ బస్సులను కేటాయించారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు కోరారు.

గంగమ్మకు వెంకన్న సారె

● తిరువీధులలో ఘనంగా ఊరేగింపు





తిరుమల నుంచి సారె తీసుకొస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు, ఛైర్మన్ బీఆర్ నాయుడు - సారెను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు అందజేస్తున్న దృశ్యం



తిరుపతి, మే 10 (ఆంధ్రజ్యోతి) : గంగ జాతరను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి చెల్లెలుగా ప్రసిద్ధికెక్కిన తాతయ్యగుంట గంగమ్మకు టీటీడీ ఆనవాయితీగా అందజేసే మేల్‌చాట్, పసుపు, కుంకుమ (సారె) శనివారం సాయంత్రం ఆలయానికి చేరుకుంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు సాయంత్రం 4గంటలకు స్థానిక గోవిందరాజ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు అందజేశారు. అక్కడి నుంచి కర్నాలవీధి, గాంధీరోడ్డు, బండ్ల వీధి, పెద్దకాపు వీధి మీదుగా అమ్మవారి సారె ఊరేగింపుగా గంగమ్మ ఆలయానికి చేరుకుంది. ఊరేగింపు ముందు కళాకారుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకన్నాయి. పలువురు లయబద్ధంగా నాట్యం చేస్తూ ఊరేగింపునకు జాతర కళను తెచ్చిపెట్టారు. ఎమ్మెల్యే కుమారుడు ఆరణి మదన్, అన్న కుమారుడు శివలు నృత్యం చేసి సందడి చేశారు. కాగా, శనివారం భక్తులు దొరవేషంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కైకాల కులస్థులు దొర వేషాన్ని, చాకలి కులస్థులు మంత్రి వేషాన్ని వేశారు.

● నేడు మాతంగి వేషం

గంగజాతర ఉత్సవాలలో భాగంగా ఆదివారం మాతంగి వేషాన్ని భక్తులు ధరిస్తారు. తలకు పసుపుగుడ్డను జడలా కట్టి కొప్పుముడివేసి దానికి మల్లెపూలను చుట్టుకుంటారు. శరీరమంతా గంధం పూసుకుని తెల్ల చీర, లేదా పసుపు చీర కట్టుకుని రవిక తొడుక్కుంటారు. మెడలో పూలహారం వేసుకుంటారు. ఒడిబాల కట్టుకుని అందులో అక్షింతలు, దువ్వెన, భరిణి, రవిక, పసుపు, కుంకుమలు పెట్టుకుంటారు. మాతంగి వెయ్యికళ్ల దేవతని ముఖానికి, ఒళ్లంతా నల్లని ఎర్రని బొట్లు పెట్టుకుంటారు. పలకలు వాయిస్తూ, కొమ్ములు ఊదుతూ ఉంటే మాతంగి వేషగాళ్లు లయబద్ధంగా చిందులు వేస్తూ వచ్చి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.



● గంగమ్మకు వజ్రపు తిలకం బహూకరణ

తాతయ్యగుంట గంగమ్మకు మంత్ర మహేశ్వరి శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి వజ్రపు తిలకాన్ని బహూకరించారు. శనివారం సారె సమర్పించిన ఆమె రూ.2లక్షల విలువైన వజ్రపు తిలకాన్ని ఈవో జయకుమార్‌కు అందజేశారు.

అమ్మవారి వసంతోత్సవాలకు అంకురార్పణ



తిరుచానూరు, మే 10(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం రాత్రి అంకురార్పణతో వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వేకువజామున అమ్మవారికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. రాత్రి విష్వక్సేనుడిని ఊరేగింపుగా ఫ్రైడేగార్డెన్‌కు తీసుకెళ్లి పుట్టమన్ను సేకరించారు. రక్షాబంధనం, సేనాపతి ఉత్సవం తర్వాత అంకురార్పణ చేశారు. ఆదివారం నుంచి ఫ్రైడేగార్డెన్‌లో మూడు రోజులూ మధ్యాహ్నం 2.30 నుంచి 4.30గంటల వరకు అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. రాత్రి 7.30 గంటలకు అమ్మవారు తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించనున్నారు. సోమవారం ఉదయం 9.45 గంటలకు స్వర్ణ రథోత్సవం జరగనుంది. భక్తులు ఒక్కొక్కరు రూ.150చెల్లించి వసంతోత్సవంలో పాల్గొనవచ్చు. అంకురార్పణ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుభాస్కర్; సుబ్బరాయుడు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వసంతోత్సవ సెట్టింగ్

తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా ఆకర్షణీయంగా సెట్టింగ్‌ను రూపొందించారు. ఏటా అమ్మవారి ఉద్యానవనంలో పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం మూడు రోజులపాటు ఈ వేడుకలు జరుపుతారు. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. వసంతోత్సవాల మండపాన్ని నందనవనంగా అలంకరించారు. వివిధ రకాల జంతువులు, పక్షులు నిజంగానే ఉన్నాయా అనేంతగా టీటీడీ ఉద్యానవన శాఖ అధికారులు, సిబ్బంది తీర్చిదిద్దారు. వన్యప్రాణుల అరుపులు వినిపించేలా సౌండ్ సిస్టమ్ అమర్చారు. పుష్పాలంకరణను విశేషంగా ఆకట్టుకుంటోంది.



పుట్టమన్ను సేకరిస్తున్న అర్చకులు

టీటీడీ ఉద్యోగులకు హెల్మెట్లు

తిరుమల, మే10(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఉద్యోగులకు శనివారం ఉదయం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో ఛైర్మన్ బీఆర్ నాయుడు హెల్మెట్లు పంపిణీ చేశారు. విరాళంగా అందిన రూ.5 లక్షల విలువైన 555 హెల్మెట్లు మొదటి విడతగా ఉద్యోగులకు అందజేశారు. ఉద్యోగులకు హెల్మెట్లు విరాళంగా అందజేసేందుకు గుంటూరుకు చెందిన జలాది రఘురామ్, ఢిల్లీకి చెందిన కేసీఎస్ హెల్మెట్ల తయారీ సంస్థ అధినేత నవీన్ ముందుకు వచ్చారన్నారు. వీరు మరో ఐదు వేల హెల్మెట్లు అందిస్తారని చెప్పారు. బోర్డు సభ్యుడు శాంతారామ్ తదితరులు పాల్గొన్నారు.